నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 08 మార్చి 2023

నేడు మంత్రి పర్యటన

నవతెలంగాణ-కామారెడ్డి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నేడు(బుధవారం) మంత్రి వేముల పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో రెఫరల్ సెంటర్, హెల్ప్ డెస్క్ ప్రారంభించిన అనంతరం కళాభారతిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీ నిధుల చెక్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

అనంతరం మధ్యాహ్నం 3:00 గంటలకు నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండల కేంద్రంలోని గురడిరెడ్డి కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ సంఘాల వడ్డీ లేని రుణాల రాయితీ నిధుల చెక్‌లను అందజేయనున్నారు. 5404 సంఘాలకు రూ.20.65 కోట్ల పంపిణీ చేయనున్నారు.

ఘనంగా షబ్-ఏ-భరత్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముస్లిం లు పవిత్రంగా భావించే షబ్ -ఏ-భరత్ ను మంగళవారం మాస్‌జిద్‌లలో ప్రత్యేక నమాజ్ చేసి రాత్రంతా జాగరణ చేపట్టారు. అంతకు ముందు తమ పేద్దల పేరు పండుగను నిర్వహించి వారి కోసం దూలాలు చేశారు. షబ్ -ఏ భారత్‌ను పురస్కరించుకుని అంతా మస్జిద్‌లలో హాఫిజ్ లు, మౌల్వీలు, అల్లాహ్ చుపిన మార్గం పై ప్రజలకు దిశా నిర్దేశనం చేసి షబ్ -ఏ-భరత్ విశిష్టతను వివరించి ప్రత్యేక దూవలు చేశారు. ఉదయం వేకువజామున ఫజార్ ప్రత్యేక పూజల అనంతరం స్మశానవాటికకు వేళ్ళి తమవారిని కోల్పోయిన వారి సమాధులపై పులి మాలలు వేసి ఘనంగా నివాళులర్పించ నున్నారు. రంజన్ ఉప వాసల నేలా ప్రారంభానికి నేటి నుండి 15 రోజుల ముందు షబ్ -ఏ-భరత్ ఉంటుందని మౌల్వీలు తెలిపారు. అయా మస్జిద్ లలో సమయలను ముందుగానే ప్రకటించారు. షబ్ -ఏ-భరత్ ను పురస్కరించుకుని మస్జిద్ లను, స్మశాన వాటిక లను విద్యుత్ దిపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

రియల్టర్‌లకు పట్టాలిస్తరు..
పేదలకు ఎందుకివ్వరు..?

- గుడిసెల జోలికొస్తే ఖబడ్దార్
- గుడిసెవాసులకు అండగా ఉంటాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్
- నెహ్రూనగర్ భూ పోరాట కేంద్రం పరిశీలన


మాట్లాడుతున్న అబ్బాస్

నవతెలంగాణ-బోధన్

శిఖం భూమిలో వ్యవసాయం పేరుతో రియల్టర్‌లకు పట్టాలు ఇస్తారు కానీ ఇండ్ల స్థలాలు వేసుకునేందుకు పేదలకు ఎందుకు పట్టాలు ఇవ్వట్లేరనిసీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ప్రశ్నించారు. 40 ఏండ్లుగా కిరాయి ఇండ్లల్లో దుర్భర జీవనం గడుపుతున్న నెహ్రూనగర్ వాసులకు 125 గజాల స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదల గుడిసెల జోలికొస్తే సహించేది లేదని, పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట్ శివారు నెహ్రూనగర్‌లో 15 రోజులుగా ఇండ్లు నిరుపేదలు సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇళ్లస్థలాలు ఆక్రమించిన విషయం తెలిసిందే. పేదలు గుడిసెలు వేసుకొని చేపట్టిన భూ పోరాట కేంద్రాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ సందర్శించారు. గుడిసెలు వేసుకున్న వారిని అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ పూర్తిస్థాయిలో అండదండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జానకంపేట్ పెద్దచెరువు రిజర్వాయర్ శిఖం భూమి 482 సర్వే నెంబర్‌లో ఉంది. వాస్తవానికి పూర్తిస్థాయిగా చెరువు నిండితే ఆ నీరు ఎక్కడి వరకైతే చేరుతుందో అక్కడి వరకు ప్రజలు ఉండటం కష్టం. అందుకు నీరురాని ప్రాంతంలో ఖచ్చితంగా ప్రభుత్వం వారు గుర్తించి పేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి. సాగు పేరుతో కొంత మంది రియల్టర్‌లకు 482 సర్వే నెంబర్‌లో పట్టాలు ఎలా ఇచ్చారని' ప్రశ్నించారు. ఆ భూమిలో ముంపునకు గురయ్యే ప్రాంతం మినహా మిగతా భూమి అంతటినీ సమకూర్చి 40 సంవత్సరాలుగా కిరాయి ఇళ్లలో దుర్భర జీవితం గడుపుతున్న నెహ్రూ నగర్ పేద ప్రజలకు 120 గజాల చొప్పున ఇవ్వాలని, అదే స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి 3 లక్షల నుంచి 5 లక్షల రూపాయల ఉచిత రుణం ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదో ఒక నెపంతో వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు యత్నిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం ఫెయిల్ అయిందని, సరిపడా భూమి ఉన్నందున పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తాము ముందు నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను కోరినట్టు తెలిపారు. కానీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించి డబుల్ ఇండ్ల వైపే మొగ్గు చూపిందని, ప్రస్తుతం అది ఫెయిల్ అయినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాల పోరాటం ఉధృతమైందని, అది తీవ్రతరమయ్యేంతవరకు, సమస్యల పోరాటాలు చేసేంతవరకు ఈ ప్రభుత్వం చూడద్దని, వెంటనే ఇళ్ల స్థలాలు రాష్ట్రమంతటా పంచి, అలాగే జానకంపేట చెరువు వెనుక ఉన్న భూమిలో గుడిసె వాసులకు కూడా పట్టాలి ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మద్దతుగా బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు ఈవిఎల్ నారాయణ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు తోపాటు గుడిసవాసులు పాల్గొన్నారు.


హాజరైన నిరుపేదలు


పిడిగుద్దుల వర్షం.. పిడిగుద్దులాటలో హున్సా గ్రామస్తులు

అదే ఉత్కంఠ..
హోరాహోరీగా పిడిగుద్దులాట

- హున్సాలో తలపడ్డ గ్రామస్తులు

నవతెలంగాణ-బోధన్

ఇసుక వేస్తే రాలనీ ప్రజానీకం.. ఎప్పటిలాగే అదే ఉత్కంఠ. అదే పిడిగుద్దులాట. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్స గ్రామంలో హోలీ పండగ సందర్భంగా ప్రతేడాదిలాగే ఈ సారి కూడా పిడిగుద్దులాట ఉత్కంఠ మధ్య కొనసాగింది. సాయంత్రం కుస్తీ పోటీల అనంతరం 6 గంటల తర్వాత గ్రామం నడిబొడ్డున ఏర్పాటుచేసిన పెద్ద దుంగలకు గట్టి తాడును కట్టి ఆట ప్రారంభించారు. ముందుగా డప్పుల చప్పుళ్లతో కుల సంఘాల పెద్దలను ఆట స్థలానికి ఆహ్వానించారు. చివరగా అందరు చేరుకున్నారని నిర్ధారించగానే తాడును ఒక చేతితో పట్టుకుని ఒక్క సారిగా మరో చేతితో ధన్‌ధన్ అంటు కొట్టుకోవడం ప్రారంభించారు. 10 నిమిషాల పాటు ఎవరిని ఎవరు కొడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరికి గాయాలైతే మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆట ముముగియగానే ఒకరికొకరు స్నేహభావంతో ఆలింగనం చేసుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం పెద్ద వారిని గౌరవ సూచికగా భుజాలపై ఎత్తుకుని కల్లు దుకాణాలకు బయలుదేరారు. కాగా పిడిగుద్దులాటను చూసేందుకు చుట్టుపక్క ప్రాంత వాసులే కాకుండా.. దూర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో హున్సా గ్రామం కిక్కిరిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పారిశుధ్య కార్మికులమవుతున్నాం

- వార్డుమెంబర్‌ల ఆవేదన
- వేతనాలు పెండింగ్ ఉండటంతో కూలీపనికి వెళ్తున్న జీపీ కార్మికులు


సమావేశంలో మాట్లాడుతున్న వార్డు మెంబర్‌లు

నవతెలంగాణ-సదాశివనగర్

అసలే రొక్కాడితే గాని డొక్కాడని నిరుపేద బతుకులు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారం కావడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కూలీ పనికి వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తుతుంది. దీంతో వార్డు సభ్యులే కార్మికుల అవతారం ఎత్తి పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

సదాశివనగర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారు కూలీ పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ పంచాయతీలో పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. జీపీలో 16 మంది కార్మికులు పని చేయగా.. వారికి 3 నెలల నుండి జీతాలు రాకపోవడంతో విధులకు దూరమై కూలీపనికి వెళ్తున్నారు. వారు రాకపోవడంతో వార్డు మెంబర్‌లు మంచి నీటి సరఫరా, మురికి కాల్వలు శుభ్రం చేస్తున్నారు. ఎవరి వార్డుకు వారే బాధ్యత వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీపీ పాలకవర్గం కోరుతోంది.

పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని సుద్ధపల్లి గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి పథకంలో భాగంగా రెండు పాఠశాలలో 20 లక్షల రూపాయల నిధులతో మూత్రశాల నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ పానుగంటి రూపా సతిష్‌రెడ్డి, ఎంపిటిసి వెంబడి సంతోషం, ఉప సర్పంచ్ శుద్ధ గంగారంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పానుగంటి రూపా సతిష్‌రెడ్డి మాట్లాడుతూ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమయానుసారం పనులను పూర్తి చేసే విధంగా చూడాలని సూచించారు. పాఠశాలకు నిధులు మంజూరు కావడం పాట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ శీలం లక్ష్మారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నరహరి రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌బండలను మోగిస్తూ నిరసన

- వంటగ్యాస్ ధరల పెరుగుదలపై మహిళల వినూత్న నిరసన


గ్యాస్‌బుడ్డిని ఇంటి ముందు ఉంచి గంటెలతో మోగిస్తున్న మహిళలు

నవతెలంగాణ-మోస్రా(వర్ని)

వంటగ్యాస్ ధరల పెరుగుదలపై మహిళలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. మోస్రా మండలంలోని గోవూర్‌లో వంటగ్యాస్ బుడ్డీలను ఇంటి ముందుకు తీసుకొచ్చి చెంచాలతో మోగిస్తూ మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అధిక భారం మోపిందని మండిపడ్డారు. 500 రూపాయలకు వచ్చే గ్యాస్‌ను.. నేడు మోడీ సర్కారు 1200 రూపాయలకు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ఇవ్వడంతో సామాన్య ప్రజలమైన తమకు కొనుక్కునే స్తోమత లేకుండా పోయిందన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ సర్కార్‌కు పేదలపై కరుణ ఉంటే వెంటనే వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ధరలు పెంచి మహిళలను మానసికంగా కృంగదీస్తున్న కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిపి ఏమి ఉద్ధరిస్తుందని ప్రశ్నించారు. గ్యాస్ ధరలను తగ్గించని యెడల భారీ ఎత్తున తమ గ్రామం నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేపడ తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఉమ్మడి మండల కో కన్వీనర్ నన్నేసాబ్, వార్డ్ మెంబర్ మైముద, మున్ని, భూలక్ష్మి షమీం, హాయ్మది, విజయ షలిమా, హబీబీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి



నవతెలంగాణ-నిజామాబాద్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాష్ట్ర ప్రగతికి పాటుపడాలని బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా సూచించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తాను కూడా మహిళా ఉపాధ్యాయులతో క్రీడల్లో పాలుపంచుకున్నారు. మహిళల హక్కుల కోసం నేటికీ పోరాడాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. చిన్నప్పటినుండే బాలిక విద్యపై కుటుంబీకులు దృష్టి సారించి వారిని ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని అప్పుడే కుటుంబంలో బాగుపడతాయని అన్నారు. మహిళా హక్కుల కోసం ఎన్నో చట్టాలు రూపొందాయి అని అన్నారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలను పారదోలెందుకు పాఠశాలలో ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

నాణ్యతకు తిలోదకాలు

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..?
- పిల్లర్లలో బయటకు కనిపిస్తున్న స్టీల్



పిల్లర్ కింద ఏర్పడ్డ రంధ్రం.. కనిపిస్తున్న స్టీల్..


నిర్మాణం కంటే ముందే పిల్లర్‌కు పగులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలో చేపట్టిన ఇంటిగ్రేడెట్ మార్కెట్ నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు పలికినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం పటిష్టంగా ఉండేందుకు పిల్లర్ల నిర్మాణం కీలకం. అలాంటి పిల్లర్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పిల్లర్ల నిర్మాణంలో స్టీల్(సలాకలు) బయటకు కనిపిస్తుండటం గమనార్హం. అందులో మట్టి పోస్తే సలాక తుప్పుపట్టి పటుత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. రూ.1.59 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న పనుల్లో నాణ్యత పరిశీలించాల్సిన పాలకులు, అధికారులు పట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని, ప్రజలకు ఉపయోగపడాల్సిన నిర్మాణం..వారి ప్రమాణాలకే ముప్పుగా నిర్మిస్తుండం సరికాదని అభిప్రయాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాయకులు ఒక్కటై ఇలాంటి నిర్మణాలు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికా రులు, పాలకులు ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ పనులు నాణ్యతగా చేపట్టేలాగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యత పాటిస్తలే



విద్యాసాగర్. ఎల్లారెడ్డి

ప్రభుత్వం మున్సిపాలిటీలలో అందరికి ఉపయోగంగా ఉండాలని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తుంటే కాంట్రాక్టర్ అధికారులు కుమ్మక్కై, నాణ్యత లేకుండా దుకాణ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇలాంటి వారి పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

రంగులు కలిసి ఉన్నట్టు ఉద్యోగులు కలిసి ఉండాలి



ఉద్యోగులకు రంగులు పూస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

రంగులు కలిసి ఉన్నట్లు ఉద్యోగులు కలిసి ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని ప్రకృతి వనంలో జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం, టీఎన్జీవోఎస్, టీజీవోఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సంబరాలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హోలీ పండుగ సందర్భంగా ఒకరిపై ఒకరు చల్లుకునేది రంగులు కాదన్నారు. అనురాగ, ఆప్యాయతలు కలిసిన రంగుల జల్లులని తెలిపారు. ఉద్యోగులు విధులు నిర్వర్తించే సమయంలో ఒత్తిడికి లోను కాకుండా తోటి ఉద్యోగులతో స్నేహభావంతో మెలగాలని చెప్పారు. ఉద్యోగులకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం మాట్లాడారు. ఉద్యోగులు స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. హోలీ సంబరాలు జరుపుకోవడానికి కలెక్టర్ అనుమతి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి బి. సాయిలు, ప్రతినిధులు దయానంద్, సతీష్ యాదవ్, దేవరాజు, నీలి లింగం, ఉద్యోగులు పాల్గొన్నారు.


హోలి సంబరాల్లో ఉద్యోగులతో కలిసి పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

చెరువులో పడి బాలుడు మృతి



నవతెలంగాణ-మోపాల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం వెలుగు జూసింది. ఎస్ఐ మహేశ్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నేరేడుగుండు నందు(15) మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల, స్నేహితుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం నీలంగుట్ట చెరువులో ఒక మృతదేహం తేలియాడునట్లు పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి చూడగా అతను నేరేడు గుండ నందుగ గుర్తించి వారి అమ్మమ్మగారైన గోసంగి గంగవ్వకు సమాచారం ఇచ్చారు. నందుకు అమ్మనాన్న లేరు. ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని తెలుపగా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కల్యాణ మండపానికి రూ. 2లక్షల అందజేత

నవతెలంగాణ-నందిపేట్



కురుమ సంఘ కల్యాణ మండపానికి తమ వంతుగా కొండూర్ గ్రామ కురుమ నాయకులు రూ. రెండు లక్షలను అధ్యక్షుడు కేజీ సురేష్ కి మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గ స్థాయిలో కురుమ సంఘ కల్యాణ మండపం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భోజన్న, మండల ఉపాధ్యక్షులు మెత్రీ బోగన్న, యూత్ అధ్యక్షులు రాజశేఖర్, భోగన్న, యూత్ నాయకులు శ్రీనివాస్, గుండంపల్లి సాయి, మెత్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- అత్తింటి వేధింపులే కారణం : తండ్రి ఫిర్యాదు

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని అమ్రాద్ తండాలో ఓవివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై యాదగిరి గౌడ్ వివరాల ప్రకారం.. మండలంలోని అమ్రాద్ తండాకు చెందిన మాలోత్ పింకు(26)ను భర్త హెూమేసింఘ్, అత్తమ్మ పీరుభాయ్ ప్రతిరోజూ నువ్వు ఇంట్లో ఉండకు చనిపో అని వేదింపులకు గురిచేసేవారన్నారు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్సై చెప్పారు. సంఘటన స్థలాన్ని సిఐ నరహరి పరిశీలించారు.

కలెక్టర్‌ద్వారా దళిత బంధు అమలు చేయాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో కాలయాపన
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భూమయ్య



మాట్లాడుతున్న భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అనర్హులకు దళితబంధు పథకాన్ని ఇచ్చి అర్హులకు నష్టం చేస్తున్నారని, ఎమ్మెల్యేల పైరవీల ద్వారా కాకుండా కలెక్టర్ ద్వారా నేరుగా అర్హులకే దళితబంధు పథకాన్ని అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.భూమయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ-సీపీఐ జిల్లా కార్యాలయంలో హెూలీ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఎ.విట్టల్ గౌడ్ అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.భూమయ్య మాట్లాడుతూ.. ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తున్నాయని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని 58, 59 జీవోలు విడుదల చేసినప్పటికీ ఎక్కడ పట్టాలు ఇవ్వలేదని అన్నారు. ప్రజాధనంతో నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూంలు అర్హులకు ఇవ్వడం లేదని అన్నారు. దళిత బంధు పేరుతో అనర్హులకు దళిత బంధు పథకాన్ని ఇచ్చి అర్హులకు నష్టం చేస్తున్నారని ఎమ్మెల్యేల పైరవీల ద్వారా కాకుండా కలెక్టర్ ద్వారా నేరుగా అర్హులకే దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా నాయకులు వై.ఓమయ్య, కే.రాజన్న, వై.రాజిరెడ్డి పాల్గొన్నారు.

అన్నింటా తానై...

హక్కుల కోసం పోరాటం

- అయినా వివక్ష
- చట్టాలున్నా.. అమలు అంతంతే
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇంట బయట అన్ని తానై ఆమె రాణిస్తోంది. అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసుకొని నేటి ఆధునిక కాలంలో మహిళ దృఢంగా నిలబడుతోంది. ఎలా అయినా ఆమెనే ప్రత్యేకం. ఇంటికి ఆమె మహారాణి. అయితే గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగం, వ్యాపారం, రాజకీయ మొదలైన రంగాల్లో ప్రవేశించి మగవారికి ధీటుగా రాణిస్తున్నారు. స్త్రీ అందంతోనే కాదు మాటలు, చేతలతో అందరి మెప్పు పొందుతుంది. నేడు అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా..

మొట్ట మొదటిసారిగా...

మొట్ట మొదటిసారిగా అమెరికాలో జాతీయ మహిళా దినోత్సవాన్ని 1909 ఫిబ్రవరి 28న జరుపుకున్నారు. ఆ తర్వాత ఏడాది కోపెన్హాగెన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించారు. 19 13 లో దీన్ని మార్చి 8వ తేదీకి మార్చారు. అప్పటి నుంచి ఆ తేదీనే అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. చైనా, ఉక్రెయిన్, వియత్నాంలతో పాటు 15 దేశాల్లో ఈ రోజున అధికారిక సెలవుదినంగా పాటిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం సైతం నేడు ప్రభుత్వ మహిళ ఉద్యోగినులకు సాధారణ సెలవు దినంగా ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాల నుండి రాణించిన, రాణిస్తున్న మహిళలు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి శ్రమశక్తి నుంచి పరిశ్రమల వరకు మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంది. స్థానిక సంస్థల నుండి సర్పంచు, మున్సిపల్ స్థాయి వరకు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్లు, మేయర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. .జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వారు తమ ప్రతిభను కనబరుస్తున్నారు. విద్య, వైద్యం, రాజకీయం, ఉద్యోగం, వ్యవసాయం, పరిశ్రమలు, సినిమా జర్నలిజం రంగాల్లో ప్రతిభ కనపరుస్తూ మగవారికి దీటుగా సేవలు అందిస్తున్నారు. జిల్లా జనాభాలో మహిళల శాతమే ఎక్కువగా ఉంది .మొత్తం జనాభాలో 50 శాతం మహిళలు ఉండగా 49 శాతం పురుషులు ఉన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు, జిల్లా కోడలు కవిత పార్లమెంటుకు సారథ్యం వహించి తన గొంతును



వినిపించినారు. చిందుల ఎల్లమ్మ బోధన్ మండలం అందాపూర్ గ్రామానికి చెందినవారు. ఇందూరు జాతిని ఖండాంతరాల్లో నిలిపారు. చిందు కళాకారునిగా హంస పురస్కారాన్ని అందుకున్నారు. ఇందూరు ఝాన్సీ లక్ష్మీబాయిగా పేరుపొందిన సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకి బాయ్ 1875 నుంచి 19 21 వరకు పరిపాలించారు.ఆ సమయంలో నిజాం ను మెప్పించి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయించారు. జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారు. క్రీడల్లో ఎండల సౌందర్య, నికిత్ జరీనా, హిమాలయ శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ, గతంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్గా పనిచేసిన ఐఏఎస్ అరుణ, కమ్మర్ పెల్లి మండలంలోని చౌటుపల్లి గ్రామానికి చెందిన భోగా విశ్వశ్రీ, కీ.శే మాజీ ఎంపీ కేశ్‌పల్లి గంగారెడ్డి మనవరాలు కీర్తి రెడ్డి సినిమా రంగంలో రాణించగా గీతాసింగ్ టీవీ రంగంలో తన ప్రతిభను కనపరిచారు.

బీడీ పరిశ్రమ, వ్యవసాయంలో..

లక్షలాది కుటుంబాలను పోషిస్తున్న బీడీపరిశ్రమ మహిళలపైనే ఆధారపడి కొనసాగుతోంది. వారు నిత్యం బీడీలు చెడితే తప్ప కుటుంబాలు నడవని పరిస్థితి ఉమ్మడి జిల్లాల్లో ఉంది. ఎంతోమంది గల్ఫ్‌కు వలస వెళితే మహిళలు అంతా తామై నడిపిస్తున్నారు. ఆర్మూర్ డివిజన్ వ్యవసాయంలో పేరుగాంచటం వెనక మహిళల పాత్ర ఎక్కువగా ఉంది అంకాపూర్ సీడ్ విలేజ్‌గా పేరు వచ్చిన అక్కడ 80 శాతం వ్యవసాయం మహిళలదే.

గర్భంలో ఉన్నప్పటినుండే వివక్ష....

లేచింది నిద్ర లేచింది మహిళా లోకం దద్దరిల్లింది పురుష ప్రపంచం అంటూ సినీ గేయ రచయిత నాలుగు దశాబ్దాల కిందే మహిళల చైతన్యం గురించి పాట రాశారు. గర్భంలో పడినప్పటి నుంచి వివక్షకు గురవుతూనే ఉంది. అయితే మహిళలను రక్షించుకునేందుకు చట్టాలున్నా అమలులో మాత్రం చుట్టాలుగా మారడంతో నేరాల సంఖ్య నానాటికి పెరుగుతుంది. వరకట్న నిరోధక చట్టం, గృహహింస చట్టం, లైంగిక వేధింపుల చట్టం ఇలా ఎన్ని చట్టాలున్నా చట్టుబండలే. మహిళ ప్రజా ప్రతినిధులు పదవికి పరిమితం అవుతున్నారు. కుటుంబ సభ్యుల జోక్యం తగ్గడం లేదు. మహిళ దినోత్సవం సమయంలోనే కాకుండా మిగతా సమయాల్లోనూ మహిళలకు గుర్తింపుని ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలలోను తగిన రిజర్వేషన్లు కల్పించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.



చిన్ననాటి నుంచే సమానంగా చూడాలి

బాలికలు, బాలురు అనే తేడా లేకుండా అందరినీ సమానత్వంతో చూడగలగాలి. చిన్ననాటినుండే సమానత్వం అలవాటు చేయాలి. మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించగలగాలి.

వెంకట రమణమ్మ, అంగన్వాడి సూపర్వైజర్.. పిప్రి

మహిళలు రాజకీయంగా రాణించాలి...

ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లో మహిళల వెనక వారి కుటుంబ సభ్యులు ఉంటున్నారు.. ఇటువంటి పరిస్థితిలో మార్పు రావాలి. మహిళలు స్వయంగా తామే నిర్ణయాలు తీసుకొని స్వతంత్రంగా వ్యవహరించగలిగాలి. ఆర్థికంగాను స్వతంత్రంగాను ఎదిగేలా చిన్నతనం నుంచి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి..

దాక్టర్ అమృతలత, రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి, ఆర్మూర్



సిల్వర్ వింగ్స్‌లో ఘనంగా యాన్యువల్ డే సెలబ్రేషన్

- విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలి
- హాజరైన ఎన్‌సీసీ(టి) బెటాలియన్ కల్నల్ రాథోడ్ జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్



పాల్గొన్న అతిథులు, కళాశాల యాజమాన్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మహలక్ష్మీ నగర్ కాలనీలోగల సిల్వర్ వింగ్స్ పాఠశాలలో సోమవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన ఎన్సిసి (టి) బెటాలియన్ కల్నల్ ఆర్ఎస్ రాథోడ్, నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులు చక్కగా చదువుకొని 100శాతం మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అప్పుడే తల్లిదండ్రులు, గురువుల పేర్లు నిలబెట్టిన వారవుతారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం భార్గవ్ భరద్వాజ్, రాహుల్ భరద్వాజ్ మాట్లాడుతూ.. తమ పాఠశాల స్థాపించిన నాటి నుండి ఎందరో విద్యార్థిని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిగమించారని తెలిపారు. విద్యార్థులలో క్రమశిక్షణ పెంపొందిస్తూ నాణ్యమైన విద్యానందిస్తూ, ఉపాధ్యాయులు, విద్యార్థులకు మధ్య ఇంటరాక్షన్ ఉండేలా కొనసాగిస్తున్నామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

వార్షికోత్సవ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.. చిన్నారులు, హై స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీతాలక్ష్మి, మేజర్ సుబేదార్ పరంజిత్ సింగ్ పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

హోలీ సంబురాలు

మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం హెూలీ సంబరాలను ప్రజల ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రజలంతా రంగుల పండుగను కేరింతల నడుమ సంబరంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. గ్రామాల్లో చిన్నారులు రంగుల డబ్బాలతోసందడి చేశారు. రంగులు పూసుకుని అలింగనం చేసుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
నవతెలంగాణ-విలేకరులు



కంఠేశ్వర్ : హోలీ వేడుకల్లో కుటుంబసమేతంగా పాల్గొన్న కలెక్టర్

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ పదవ తరగతి విద్యార్థులు చిన్న నాటి స్నేహితుల ఇంటి వద్దకు వెళ్లి వారి చిన్ననాటి మిత్రులను, వారి కుటుంబ సభ్యులను కలుసుకుంటూ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సర్పంచ్ గడ్డం స్వామి ఆధ్వర్యంలో యువకులు హెూలీ వేడుకలను చేసుకున్నారు. మాక్లూర్ మండలం, సిరికొండ, డిచ్‌పల్లి మండలాల్లో హోలీ సందర్భంగా రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు.

ఆర్మూర్:పట్టణంలోని పాత బస్టాండ్ లో హెూలీ పండుగని పురస్కరించుకొని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ మిత్రులందరు కలిసి కృత్రిమ రంగులను పూసుకునీ హెూలీ పండగను జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి దాచేపల్లి సంతోష్, బేల్దారి శ్రీనివాస్, డీకే అరవింద్, ఆకుల గంగాధర్, డీజే కిరణ్, గోవర్ధన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు పోలీస్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం పోలీస్ క్యాంప్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ నాగరాజు కుటుంబసమేతంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కంఠేశ్వర్:టీఎన్జీవో ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన హెూలీ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్ అండ్ బి శాఖ జిల్లా అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి హెూలీ శు భాకాంక్షలు తెలిపారు. కుడుకల పేర్లతో సన్మానించి నృత్యాలు చేశారు.



మాక్లూర్ మండలంలో..



కంఠేశ్వర్ : హోలీవేడుకల్లో సీపీ, తదితరులు



సిరికొండ మండలంలో..



కమ్మర్‌పల్లిలో..

ఘనంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఆశీర్వదించిన సీఎం కేసీఆర్
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- భారీగా తరలివచ్చిన అభిమానులు

నవతెలంగాణ-ఆర్మూర్/నందిపేట్

పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బంధు మిత్రులు, అభిమానులు, బీఆర్ ఎస్ శ్రేణులతో ఆర్మూర్-అంకాపూర్‌లోని జీవన్ రెడ్డి నివాసంలో కోలాహలం నెలకొంది. అంకాపూర్ గ్రామంనుంచి నుంచి ఆర్మూర్ బీఆర్ఎస్ యువకులు ర్యాలీగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. డప్పు చప్పుళ్లతో జీవన్ రెడ్డి కి స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అభిమానుల మధ్య జీవన్ రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. జీవన్ రెడ్డి దంపతులను గజ మాలలతో సత్కరించారు.

ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల పెద్దలు, కుల సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు హాజరై జీవన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యే వద్దకు డప్పు చప్పులతో వచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన నివాసంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తన జీవితం ఆర్మూర్ ప్రజల సేవకే అంకితం అని భావోద్వేగానికి గురయ్యారు. సీఎం కేసీఆర్ బాటలో నడుస్తానని, ఆయన తనకు దైవ సమానులని, పితృ సమానులని, ఉద్యమంలోనే కాదు, రాష్ట్ర అభివృద్ధిలోనూ కేసీఆర్ వెన్నంటే ఉంటానని ఉద్ఘాటించారు. పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు అందించడానికొచ్చిన అందరికీ పాదాభివందనం అని తెలిపారు. ఆశీస్సులు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్, శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, తదితరులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, పండిత్ ప్రేమ్, కాందేశ్ శ్రీనివాస్, పట్టణ, మండల అధ్యక్షులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, జిల్లా నలుమూలల నుండి నందిపేట్, మాక్లూర్ మండలాల నుండి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నందిపేట్:మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. వెల్మల్ గ్రామంలో వెంకటేశ్వర మందిరంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెల్మల్ రాజన్న, సర్పంచ్ మచ్చర్ల సాయమ్మ, ఉప సర్పంచ్ నారాయణ, కేజీ సురేష్, రాము, ప్రసాద్, శంకర్, విజయ్, బాలు తదితరులు పాల్గొన్నారు.



అభిమానులు, ప్రజాప్రతినిధుల మధ్యం పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం

ముఖ్యమంత్రి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసదర్భంగా సీఎం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సిద్దుల గుట్టపై పూజలు

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ట్టణంలోని సిద్దులగుట్టపై బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్లు ఇట్టెడి నర్సారెడ్డి, బరాడ్ రమేష్, లిక్కి శంకర్, చాలా ప్రసాద్, పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డిలు విచ్చేసి రామాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, మీనాచందు, కిషన్, లక్ష్మణ్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పై పాట ఆవిష్కరణ

బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డిని కొనియాడుతూ రూపొందించిన పాటను ఆయనే స్వయంగా ఆవిష్కరించారు. తనపై పాటను ఆవిష్కరించిన పార్టీ నేతలను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కళ్లెం బోజరెడ్డి, సోమ హేమంత్ రెడ్డి, అసపురం శ్రీనివాస్ రెడ్డి, డాన్ మహేష్ రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, గడ్డం మల్లారెడ్డి, యెనుగంటి లింబాద్రి, నర్మెనవీన్, నూతుల అశోక్, చిన్న రెడ్డి, యల్లా నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నిత్య ఈఎన్టి హాస్పిటల్ మేనేజర్ ఎస్.కె ఉస్మాన్ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించార. కార్యక్రమంలో పెరికిట్ సత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీడీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



నందిపేట్ : పూజలు చేయిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్ గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈశ్వర్ (49) గత రెండు సంవత్సరాల క్రితం అప్పు చేసి పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లాడు. సంవత్సరం తర్వాత కంపెనీ మూసి వేయడంతో దుబాయ్ నుంచి ఇంటికి తిరిగివచ్చాడు. దుబాయ్ వెళ్లడానికి చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబీకులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సావర్‌గావ్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్లు పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని సావర్‌గావ్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లను పంచాయతీ రాజ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కిషన్ పోవార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్‌ఏఈ మాట్లాడుతూ.. సావర్‌గావ్ జీపీకి ఐదు ఇండ్లు మంజూరయ్యాని, లబ్దిదారులు స్వంత జాగా ఉండి నిర్మాణాలను చేసుకుంటున్నారని, ప్రస్తుతం స్లాబ్ వేసేందుకు సన్నద్ధంగా ఉండటంతో, సాంకేతికంగా పరిశీలన చేసామని, స్లాబ్ వేయనున్నట్టు తెలిపారు. నాణ్యంగా నిర్మాణాలు చేయాలని గుత్తేదారునికి ఆదేశించానని తెలిపారు. పీఆర్ ఏఈతో పాటు సర్పంచ్, ఉపసర్పంచ్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-పిట్లం



అంజయ్య (ఫైల్)

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని మార్దండ గ్రామానికి చెందిన రొట్టెల అంజయ్య (32)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి గ్రామ సరిహద్దులోని ఎలిమెల కుంట చెరువులో పడేశారని మృతుడి అమ్మ రొట్టెల మాధవ్వ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటన స్థలానికి బాన్సువాడ డి.ఎస్.పి జగన్నాథ్‌రెడ్డి, సీఐ మురళి సిబ్బందితో చేరుకొని నేర స్థలంలోనే పీఎంఈ చేయించి కుటుంబీకులకు శవాన్ని అప్పగించారు. కాగా హత్య చేసిన వారికోసం గాలిస్తున్నారు. కాగా మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

108లో ప్రసవం

- తల్లీ, బిడ్డ క్షేమం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రానికి చెందిన సీహెచ్ సోనీ (22) అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో భర్త సంజీవ్ కుమార్ 108కి ఫోన్ చేయడంతో కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా.. సిబ్బంది లేకపోవడంతో బోధన్‌కు తరలించే సమయంలో మార్గమధ్యంలో ప్రసవమైంది. కాగా తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 ఈయమ్‌టీ గంగారం, పైలెట్ కలీంపాష, ఆశావర్కర్ తెలిపారు.

సాలంపాడ్ క్యాంప్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామంలోని పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ తూము అంజమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుద్దె సావిత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ అమీర్ బోధన్ ఉమ్మడి మండలంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నారని అన్నారు. సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో పలు కాలనీలలో సీసీ రోడ్లు నిర్మించడానికి ఉపాధి హామీ నిధుల ద్వారా 40 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కృషికి ఆమె గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి గ్రామాలను జిల్లాలోని ఆదర్శంగా తీర్చిదిద్దాలని స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, మండల అధ్యక్షులు నరసయ్య, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, గ్రామ పెద్దలు తూము రవి, నర్సారెడ్డి, ఎంపీటీసీ వెంకట్రావు, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక చేయూత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ జన్మదినం సందర్భంగా ముగ్గురు అనాథ పిల్లలకు ఆర్థిక చేయూతను అందించారు. నవీపేట్ మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన రాసరి నవీన్ (35) కూలీ పని చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అప్పుల బాధ భరించలేక ఉరివేసుకొని మృతి చెందడంతో ముగ్గురు బాలికలు అనాథలయ్యారు. నాగలక్ష్మి 9, సహస్ర 7, విష్ణు ప్రియ 4 ముగ్గురు ఆడపిల్లలు అనాథలయ్యారు. గత మూడు సంవత్సరాల కిందట తల్లి లలిత మనస్పర్థాలతో ఆత్మహత్య చేసుకోగా, తండ్రి నవీన్ వారిని పోషించుకుంటూ వచ్చారు. అనాథ పిల్లలకు చేయూతనందించాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని ఒక్కొక్కరికి 5000 రూపాయల చొప్పున పోస్టాఫీస్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి చెక్కులను అందజేశారు. ఈ విషయం తెలిసిన బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్‌తో పాటు ఆయన సతీమణి వారికి ఆర్థికంగా ఆదుకోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్కే అహమ్మద్, మండల ఉపాధ్యక్షులు హాజీ ఖాన్, కే.సాయిలు, గోసంగి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు, గంధం రాజేష్, పత్రి సురేష్, గంగయ్య, మహేష్, సాయిలు, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయానికి వెండి ప్రతిమ అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతిరెడ్డిపల్లి ఆంజనేయ ఆలయానికి మండల కేంద్రానికి చెందిన జగదీష్ సేట్ వనిత దంపతులు మంగళవారం 800ల గ్రాముల సీతారాముల వెండి ప్రతిమను అందజేసినట్టు ఆలయ పూజారి తేజ స్వామి తెలిపారు. ఆలయ భూదానం నిమిత్తం నాందేడ్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభాకర్‌రావు రూ.16వేలను విరాళంగా అందజేసినట్టు ఆయన తెలిపారు.

చదువుతోనే భవిష్యత్తు

- సాలూరా తహసీల్దార్ పడాల మమత

నవతెలంగాణ-బోధన్



ప్రతి ఆడపిల్ల జీవితంలో స్థిరపడాలంటే వారు చదువుకుంటేనే సాధ్యమని సాలురా మండల తొలి మహిళ తహసీల్దార్ మమత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆమె తన సందేశాన్నిచ్చారు. తాము తమ తల్లిదండ్రులకు ఐదుగురు ఆడపిల్లలమని అయినా మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాన్న అందరిని డిగ్రీ వరకు చదివించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న నాన్న 2005వ సంవత్సరంలో గుండెపోటుతో చనిపోయారని, దాంతో 2007 జనవరిలో వారసత్వ ఉద్యోగంలో భాగంగా తనకు ఉద్యోగం వచ్చిందని తెలిపారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో 5సంవత్సరాలు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించానని, అక్కడి నుంచి డిచ్‌పల్లిలో మండల ఆర్ఐగా 2సంవత్సరాలు, అక్కడి నుంచి బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా 4 సంవత్సరాలు, అక్కడి నుంచి ప్రమోషన్‌లో భాగంగా డిప్యూటీ తహసీల్దార్‌గా మద్నూర్ మండలానికి బదిలీపై వెళ్లినట్టు తెలిపారు. మద్నూర్ మండలంలో 1 సంవత్సరం విధులు నిర్వహించిన అనంతరం రుద్రూర్ మండలంలో 3 సంవత్సరాలు పనిచేశారని పేర్కొన్నారు. అక్కడి నుంచి తిరిగి బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో రెండున్నర సంవత్సరాలు విధులు నిర్వహించానని, ప్రస్తుతం ప్రమోషన్‌లో భాగంగా సాలూర కొత్త మండలానికి తహసీల్దారుగా ప్రమోషన్ వచ్చిందని ఆమె తెలిపారు. కొంతమంది నిరక్షరాస్యులైన మహిళలు వారి పనుల కోసం నా వద్దకు వచ్చినపుడు వారు, ఏదో కొంత చదువుకున్న వారు ఏమి తెలియక ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో నేనే స్వయంగా చూసి బాధపడిన ఘటనలున్నాయని చెప్పారు. కావున ప్రతి మహిళ చదువుకుంటేనే సమాజంలో ఉన్నతంగా జీవిస్తారని తెలిపారు. గ్రూప్ వన్ అధికారిగా తనకు అవకాశం రావడంతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించడం తనకు గర్వకారణంగానూ, సంతోషంగా ఉందన్నారు. ప్రతి కుటుంబంలో ఆడపిల్ల ఉన్నత చదువులు చదువుకుంటేనే సమాజంలో ధైర్యంగా జీవించే అవకాశం ఉంటుందని, తల్లిదండ్రులు ఆడపిల్లలు సమాజంలో ఎలా మసులుకోవాలో నేర్పించాలని, అవగాహన కల్పించాలని సూచించారు. మా నాన్న ఆశయం మేరకు 5 మంది సోదరిమణులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడ్డామన్నారు. తన భర్త రెంజల్ మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

హోలీ సందడి

• ఉమ్మడి జిల్లాలో ఘనంగా వేడుకలు • పలుచోట్ల గుండులేపిన యువకులు • గాంధారిలో జడకొప్ప

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో హోలీ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు చెప్పకొన్నారు. అలాగే సోమవారం రాత్రి పలు గ్రామాల్లో కామదహనం చేపట్టారు. గాంధారి మండలంలోని గండిపేట్ గ్రామంలో 100 కేజీలు ఉన్న బాల గుండును యువకులు ఎత్తుకొని తిరిగారు. గుండు లేపడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. అలాగే గాంధారి మండల కేంద్రంలో హెూలీని పురస్కరించుకొని అంగడి బజార్లో జడ కొప్పు అల్లడం ఆనవాయితీగా వస్తోంది. అల్లిన జడ కొప్పును ఉగాది రోజు విప్పుతారు.



జుక్కల్: హోలీ వేడుకల్లో జుక్కల్ జెడ్పీటీసీ, తదితరులు



భిక్కనూర్ : సిద్ధరామేశ్వరనగర్‌లో..



గాంధారి : జడకొప్పులాట ఆడుతున్న గ్రామస్తులు



బోధన్‌లో..



రామారెడ్డి : గొల్లపల్లిలో..



కోటగిరిలో..



ఎల్లారెడ్డి : ఎంపీడీవో కార్యాలయం ఎదుట హోలీ వేడుకల్లో సర్పంచ్‌లు



లింగంపేట్‌లో..




సదాశివనగర్ : పద్మాజివాడి తండాలో..



పెద్దకొడప్‌గల్‌లో..



వర్ని : జాకోరాలో..



గాంధారి : గండిపేట్‌లో..



తాడ్వాయి : క్రిష్టాజీవాడిలో..

రైతుబీమా కోసం తండ్రిని హత్య చేసిన కొడుకు

- వివరాలు వెల్లడించిన పోలీసులు

నవతెలంగాణ-బోధన్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రైతుబీమా కోసం తండ్రిని హత్య చేశాడో తనయుడు. ఆ కేసు వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. మండలంలోని ఊటపల్లి గ్రామానికి చెందిన జడల రఘుపతి మదారి(58) అనే వృద్ధుడు ఈ నెల 2వ తేదీన అమ్దాపూర్ సమీపంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. బోధన్ రూరల్ ఎస్సై సందీప్, రూరల్ సీఐ శ్రీనివాసరాజ్ దర్యాప్తు ప్రారంభించి చాకచక్యంగా వ్యవహరించి వారం రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసి అదుపులో తీసుకున్నారు. కాగా మంగళవారం బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి ఘటన వివరాలు వెల్లడించారు. మృతుడు జడల రఘుపతి మదారి కుమారుడు అయిన జడల రఘుపతి నరేష్ గ్రామంలో జులాయిగా తిరుగుతూ ఏ పని చేయకుండా జల్సాలు చేసేవాడు. కల్లు దుకాణంలో పనిచేసే తన తండ్రి మదారిని ఖర్చుల కోసం డబ్బులు అడగడం, చీటికి మాటికి గొడవలు పెట్టుకోవడం చేసేవాడు. ఇది సహించని మృతుడి కుమారుడు, కోడలు వృద్ధుడిని చంపితే అతని పేరున ఉన్న రెండు గుంటల భూమి తన పేరున అవుతుందని, అలాగే మరణానంతరం రూ.5లక్షల రైతుబీమా వస్తుందని దాంతో ఇబ్బందులు లేకుండా ఉండవచ్చని భావించారు. పథకంలో భాగంగా తన తండ్రిని చంపడమే మార్గమని నరేష్ భావించాడు. దాంతో తన భార్య అనితతో పథకం రచించి రుద్రూర్ మండలానికి చెందిన బత్తుల గంగసాగర్, ఆరెల్ల చిన్న సాయిలు అనే వారిని సంప్రదించి తన తండ్రిని చంపితే రూ.50వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నారు. ముందుగా వారికి రూ.10వేలు చెల్లించారు. బెల్లల్‌లో కల్లు బట్టిలో పని ముగించుకుని మోపెడ్‌పై ఇంటికి వెళ్తున్న మదారిని అమ్దాపూర్ శివారులో రాగానే ద్విచక్ర వాహనంపై గంగాసాగర్, చిన్న సాయిలు అనుసరించి వెనుక నుంచి వారి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. మదారి కింద పడిపోగానే మూకుమ్మడిగా దాడిచేశారు. మృతిచెందాక అనుమానం రాకుండా మృతదేహాన్ని వజ్రాసనములో చెట్టుకింద కూర్చోబెట్టి పారిపోయారు. మృతుని కొడుకుపై అనుమానంతో నిఘావేసి అతని కదలికలను పోలీసులు నిఘావేయడంతో సోమవారం ఘన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మినార్‌పల్లి సమీపంలో నిందితులు ముగ్గురు తారసపడ్డారు. ఈ హత్యలో భాగమైన మృతుని కోడలు అనితను ఇంటి వద్ద అరెస్టు చేసి వారిని పట్టుకుని విచారించగా హత్య తామే చేసినట్టు వారు ఒప్పుకున్నారని ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. హత్య ఘటనను వారం రోజుల్లో ఛేదించిన సీఐ శ్రీనివాసరాజ్, ఎస్ఐ సందీప్, పోలీస్ సిబ్బందిని సీపీ నాగరాజు అభినందించినట్టు ఏసీపీ తెలిపారు.

ఎమ్మెల్యే షకీల్ జన్మదిన వేడుకలు

- సీఎంను కలిసి బోధన్ ఎమ్మెల్యే
- సాలూర, జాడీజమాల్‌పూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-బోధన్/రెంజల్



పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేసీఆర్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే షకీల్ అమీర్ - ఆయేషా ఫాతిమా దంపతులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దాంతో సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ జన్మదిన వేడుకలను సాలూర, బోధన్ మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సొసైటీ చైర్మెన్ అల్లె జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీపీ బుద్దె సావిత్రి, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్, వెంకట్ పటేల్, సురేష్, కార్యదర్శి షేక్ మౌలా, ఖదీర్, సాయరెడ్డి, లక్ష్మణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జాడీజమాల్‌పూర్‌లో..

జాడీజమాల్‌పూర్ గ్రామంలో మండలాధ్యక్షులు నర్సయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షకీల్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి అనంతరం గ్రామంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ఎంపీపీ బుద్దె సావిత్రి, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, సీనియర్ నేత బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ షకీల్, నాయకులు మజార్, గణేష్ పాటిల్, రాజేందర్, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే షకీల్ జన్మదిన వేడుకలు

రెంజల్ : మండలంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో బీఆర్ఎస్ మండల నాయకులు, బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినీలకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన జన్మదినాన్ని పురసరించుకొని కేక్ కట్ చేసి, చిన్నారులకు తినిపించారు. సుమారు 400ల మంది విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి, రఫిక్, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ధనుంజయ్, సర్పంచ్ గణేష్ నాయక్, ఎంపీటీసీ అసాద్ బేగ్, నీలా సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, మోసిన్‌బేగ్, రాము, లింగం, కాశం సాయిలు, రాఘవేందర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెంజల్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

విద్యార్థి సంఘాల ఉద్యమానికి మద్దతు తెలపాలి

- మాజీ మంత్రి షబ్బీర్ అలీని కలిసిన విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



వినతినిస్తున్న నాయకులు

విద్యార్థి సంఘాల ఉద్యమానికి మద్దతు తెలపాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీని విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కామారెడ్డి జిల్లా ఆసుపత్రిని జిల్లా కేంద్రం నుంచి తరలించాల్సి వస్తే కచ్చితంగా దోమకొండలో ఏర్పాటు చేయాలని గత వారం రోజులుగా విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళనలో భాగంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీని హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి వారు చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. దోమకొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో 120 రోజులపాటు ఆందోళనలు చేసినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్దన్‌తో పాటు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే ఉన్నత విద్య విషయంలో నష్టపోయిన దోమకొండ ప్రాంతం మరో మారు వైద్యం విషయంలో సైతం నష్టపోకుండా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని షబ్బీర్ అలీని కోరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ స్పందిస్తూ జిల్లా ఆసుపత్రి కామారెడ్డిలోనే కొనసాగేలా ప్రయత్నం చేద్దామని తప్పనిసరైతే దోమకొండ ఆసుపత్రిని వంద పడకలకు పెంచి జిల్లా ఆసుపత్రిగా మార్చితే దోమకొండతోపాటు బీబీపేట్, భిక్కనూరు, మాచారెడ్డి మండలాల ప్రజలు ఉన్నత వైద్యానికి అర్హులవుతారని తెలిపారు. ఖచ్చితంగా ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని విద్యార్థి సంఘ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాలు, టీజేఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్



చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని లింగంపేట్ జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పరిష్కరించుకొని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే మహిళలు పురుషులతో సమానంగా పోటీపడతారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యపరంగా అన్ని రంగాలలో మహిళలు ముం దడుగు వేస్తార న్నారు. అప్పుడే మహిళా సాధికారతకు న్యాయం జరిగి నట్టు అవుతుంద న్నారు.

నేడు మహిళలకు ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకోసం నేడు ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్టు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి ఉద్యోగమేళాకు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామాబాద్ (Reliance Nippon Life Insurance) నిజామాబాద్ జిల్లా పరిధిలోనే లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకోసం అని పేర్కొన్నారు. విద్యార్హత ఏదైనా డిగ్రీ, వయోపరిమితి 30ఏండ్లపైన ఉండవలెనని తెలిపారు. ఆసక్తి గల మహిళలు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9581768413, 9959456793 వివరాలు బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో, సర్టిఫికెట్స్ వెంట తీసుకొని రావాలని తెలిపారు.

రేపు తైబజార్ వేలం



నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన తైబజార్, పశువధశాలకు సంబంధించిన వేలంపాట నిర్వహించనున్నట్టు, కావున ఆసక్తి గలవారు మార్చి 9వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నారీ శక్తి దేశప్రగతికి నిదర్శనం



నేడు 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'

8th MARCH Women's DAY

నారీ శక్తి దేశ ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ.. నేడు ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్న పదాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఒక్కో రంగంలో అడుగులేస్తూ.. అన్ని రంగాల్లో తమ ప్రతిభ చాటుతున్నారు. మహిళా దినోత్సవం వేళ.. తాజాగా భారత వైమానిక దళం మహిళలు నేరుగా యుద్ధక్షేత్రంలో విధులు నిర్వర్తించే అవకాశాన్ని ఇచ్చింది. గ్రూప్ కెప్టన్ షాలిజా ధామి పశ్చిమ సెక్టార్‌లో ఫ్రంట్‌లైన్ కాంబాట్ యూనిట్‌లో కమాండ్ బాధ్యతలు అప్పగింతపై దేశ వ్యాప్తంగా హర్షాతిరేఖలు వ్యక్తమవుతున్నాయి. తల్లిలా దేశ భద్రతను కాపాడటంలో సైతం ముందున్నారు. రక్షణ రంగంలోనే కాకుండా రాజకీయవేత్తగాను, డాక్టర్ గాను, పారిశ్రామికవేత్తగాను, గగనతనంలో పైలెట్లుగా అనేక రంగాలలో ఎదుగుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. – నవతెలంగాణ-విలేకరులబృందం

మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పాటుపడాలి

• ఐద్వా జిల్లా కార్యదర్శి సబ్బని లత

నవతెలంగాణ-కంఠేశ్వర్



మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పాటుపడాలి. నారీ శక్తి దేశ ప్రగతికి నిలువెత్తు నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో 33శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలకు అంకితం చేయాలి. మహిళలు ఆకాశంలో సగం అవనిలో సగం అన్న పదాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. మహిళలు చదువులోనే కాకుండా తల్లిలా దేశ భద్రతను కాపాడటంలో ముందున్నారు. రక్షణ రంగంలోనే కాకుండా రాజకీయవేత్తగాను, డాక్టర్ గాను, పారిశ్రామికవేత్తగాను, గగనతనంలో పైలెట్లుగా అనేక రంగాలలో ఎదుగుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి ఏటా మార్చి 8న 1909 సంవత్సరం నుంచి మహిళా దినోత్సవం జరుపుకోవడం ప్రారంభమైంది. మహిళా దినోత్సవ చరిత్ర అమెరికాలో 1908 లో కార్మిక ఉద్యమ సందర్భంగా ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో దాదాపుగా 15000 మంది మహిళలు పాల్గొన్నారు. వారంతా తమ హక్కులను సాధించుకోవాలని కాంక్షతో న్యూయార్క్ వీధుల్లోకి ఒక్కసారిగా వచ్చి ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించారు. పని గంటలు తగ్గించి వేతనాలు పెంచాలనే నినాదం ఎత్తుకొని విజయం సాధించారు. మరియు మహిళలకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్లను నెరవేర్చేదాక ఉద్యమాలను ఆపకుండా ధీరత్వాన్ని ప్రదర్శించారు. దీంతో 1909 లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా మహిళా దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క థీమ్ ఎంబ్రసీ ఈక్విటీ అంటే లింగ సమానత్వంపై దృష్టి సారిస్తుందని అర్థం. కానీ నేటి సమాజంలో మహిళలపై అనేకంగా దాడులు పెరుగుతున్నాయి. వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విధివిధానాన్ని అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మోడీ ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలి. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించే ప్రణాళికను సిద్ధం చేయాలి. మహిళల హక్కులను ప్రభుత్వం కాపాడాలి. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం పాటుపడే విధంగా కృషి చేయాలి.

మహిళలే దేశ ప్రగతి సాధకులు

• మహిళలు స్వశక్తితో ఎదగాలి

• నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మహిళలే దేశ ప్రగతి సాధకులు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తోటి మహిళలందరికీ శుభాకాంక్షలు. తాను సాధించిన విజయాలన్ని తన తల్లి దీవెనలు. చిన్నప్పటి నుండి అమ్మ విజయ కుమారిని ఆదర్శంగా తీసుకున్నాను. ముందుగా నేను మహిళను అయినందుకు ఎంతో గర్విస్తున్నాను. నేటి సమాజంలో స్త్రీల పాత్ర అభినందనీయంగా ఉంది. మహిళలందరూ తమ ఉనికిని చాటుకొని స్వశక్తితో, ఆత్మగౌరవంతో ఉన్నత స్థితికి చేరుకోవాలి. మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. అన్ని రంగాలలో రాణించాలని నా ఆకాంక్ష. మహిళ అన్న పదంలో నే మహి (అనగా భూమి) ఉన్నది. ఈ మహిళ లేకపోతే భూమియే లేదు. యత్ర నార్యంతు పూజ్యంతే రమంతే తత్ర దేవత' అని ఆర్యోక్తి. దీనికి అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని. కానీ నేటికి ఆడవారిపై అత్యాచారంవంటి అమానుష సంఘటనలు జరుగుతుండటం దురదృష్టకరం. ఇక నుండైన ఆ అకృత్యాలపై కఠినమైన శిక్షాస్మృతిని తీసుకురావాలి. స్త్రీల జీవన స్థితిగతులు మెరుగుపడకపోతే ఏ దేశం అభివృద్ధి చెందదు. స్త్రీ విజయానికి పురుషుడు మార్గమై నిలవాలి, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

• బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి



నవతెలంగాణ-బోధన్

సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనంటూ అందరూ చెబుతున్న మాట వాస్తమే కానీ.. కేంద్ర ప్రభుత్వం మాత్రం మహిళలకు చట్ట సభల్లో సమాన అవకాశాలు ఇవ్వడం లేదని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మహిళ బిల్లును ప్రవేశపెట్టకుండా విస్మరించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో వార్డు సభ్యుల నుంచి జిల్లా పరిషత్ ఎన్నికల్లో మహిళలకు తెలంగాణ ప్రభుత్వం 50శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుందని, కానీ చట్టసభల్లోనే మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలు కావడం లేదని తెలిపారు. కావున కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించేలా మహిళ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే మహిళ దినోత్సవానికి సార్థకం ఉంటుందన్నారు.

మార్పు చేయు సాధనంగా మహిళలు

సూర్య కాంతి వలే శక్తివంతంగా కనిపించి
చంద్ర కాంతి వలే ఒదిగి ఒదిగి ఉండి
పైకి సున్నితంగా కనిపించినా..
సరిహద్దులు లేని విజయోత్సవాలను ఆవిష్కరిస్తుంది మహిళ.
భరించలేని ప్రసవ వేదనను సైతం దాటి
బిడ్డకు జన్మనిచ్చి, ముద్రు పొలిచ్చి, మురిపాలు పంచి,
నయనానికి వెలుగై, హృదయానికి బలమై,
మమతను కురిపిస్తూ, మనసును పాలిస్తూ,
వేలు పట్టి భవిత వైపు నడిపిస్తుంది.
తల్లిగా ఊయల ఊపి జోల పాట పాడిన మహిళ..
వీర వనితగా, వీరనారీమణిగా,
నేడు ప్రపంచాన్ని ఏలు స్థాయికి సైతం చేరింది.
అందుకే అమ్మగా, సోదరిగా, అర్ధాంగిగా,
ప్రపంచానికే ఓ పర్యాయ పదం స్త్రీ.
ఆకాశమే విరిగిపడితే లోకమంతా చీకటికమ్మును కదా !
కూకటి వ్రేళ్ళ లేకపోతే మహావృక్షమైన మట్టి పాలే కదా !
మహిళలేని లోకం నీరు లేని సేద్యమే.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో



- పాత లక్ష్మీ
(పంచాయతీ కార్యదర్శి,
పెద్ద మల్లారెడ్డి, భిక్కనూర్ మండలం.)

33 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాటం చేద్దాం

• మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మహిళలకి చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాటం చేద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఈనెల 10 ఢిల్లీలో ధర్నా చేపట్టడానికి మేమంతా కూడా కవితకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం. మహిళా రిజర్వేషన్ కోసం ఎమ్మెల్సీ కవిత తొమ్మిదేళ్లుగా పోరాటం చేశారు. నాడు ఎంపీగా నేడు ఎమ్మెల్సీగా పోరాటం చేస్తున్నారు. చట్టసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ప్రధాని మోడీ తలుచుకుంటే ఇది సాధ్యమవుతుంది. కానీ మోడీకి చిత్తశుద్ధి లేదు అందుకే మహిళ రిజర్వేషన్ బిల్లు ఆమోదం తెలపడలేదు. ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకొని ముందుకు వెళ్లాలి. జిల్లాలోని మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

స్త్రీలను మనుషులుగా చూడని మతాలు

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



స్త్రీలను బానిసలుగా చేసి, ప్రాతివత్యానికి కుదించి, వంటింటి కుందేళ్ళుగా మార్చినవి మత భావనలే. స్త్రీలను బురఖాల్లోకి నెట్టిన మతాలెన్నడూ వారిని మనుషులుగా చూడలేదు. అభ్యున్నతి సాధించామనుకుంటున్న ఈ 21వ శతాబ్దంలోకి వచ్చిన తర్వాత కూడా స్త్రీల పరిస్థితి ఏ మాత్రం బాగుపడలేదు. ఒకప్పుడు వారికి ఓటు హక్కు లేదు. ఉద్యోగాలు చేసినా పురుషులతో సమానంగా జీతాలు లేవు. కూలిపనిలో సైతం మగవారికి దొరికినంత కూలి దొరకలేదు. ఇలాంటి ఎన్నో సామాజిక అవకతవకలకు మూలకారణం మతభావనలే. అవగాహన రాహిత్యమే. మహిళా వ్యోమగాములు అంతరిక్షం చుట్టివస్తారు గానీ కొన్ని దేవాలయాల్లోకి ప్రవేశించలేరు. మన భారతీయ మహిళా శాస్త్రవేత్తను --రాయల్సాయిటీ --గుర్తిస్తుంది కానీ, ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ముట్టుగుడిసె లుంటాయి. అర్ధనారీశ్వరుణ్ణి సృష్టించుకుని పూజలు చేస్తారు గానీ కుటుంబ వ్యవస్థ బలంగా కొనసాగడానికి పూర్తి సమయం వెచ్చిస్తున్న మహిళల్ని మాత్రం తక్కువగానే చూస్తారు.

అక్షరాస్యత ఉంటేనే అన్ని సాధించవచ్చు

• మండల వైద్యాధికారి డాక్టర్ హిమబిందు

నవతెలంగాణ-లింగంపేట్



అక్షరాస్యత ఉంటేనే అన్ని సాధ్యమవుతాయని లింగంపేట మండల వైద్యాధికారి హిమబిందు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. మహిళలు తమ పిల్లల్ని చదివించాలని, చదువుతోటే పిల్లల భవిష్యత్తు భావితరాలకు దారితీస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివి డాక్టర్లు, ఇంజనీర్లు వివిధ రంగాల్లో మహిళలు రాణించవచ్చున్నారు. అక్షరాస్యత లేనిది ఏదీ సాధ్యం కాదన్నారు. పట్టుదలతో ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. అందుకనే ప్రతి మహిళ తమ పిల్లల్ని చదివించాలని ఆమె సూచించారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీపడాలన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు తమ పిల్లల చదువులు అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 100 శాతం అక్షరాస్యత ఉన్న రాష్ట్రాల్లో మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, పాటించిన వారు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

నవతెలంగాణ-బోధన్



మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాలలో ఎదగాలని సాలూర ఎంపీటీసీ కండెలా సవిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుని ఆమె నేటి మహిళలకు సందేశానిచ్చారు. ప్రతి మహిళ వారికి ఇష్టమున్న రంగాలలో రాణించాలన్నారు. ముఖ్యంగా మహిళలు చట్టాలపై, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదవడానికి ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. తాను ప్రజలకు తనవంతు సేవ చేయాలనే ఉద్దేశంతో తన భర్త కండెల సంజీవ్ ప్రోత్సాహంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదర్శంగా తీసుకుని తొలిసారిగా రాజకీయాల్లోకి వచ్చినట్టు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు, న్యాయవాదికి వాగ్వివాదం

• వాహనాలు తనిఖీచేస్తుండగా లాయర్ వాహనం తాళాలు తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ట్రాఫిక్ ఎస్ఐ న్యాయవాది వాహనం తాళాలు లాక్కోవడం, దీనిపై న్యాయవాది ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సోమవారం ప్రభుత్వ హాస్పిటల్ ముందు ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో న్యాయవాదులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యాయవాదులు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్ ద్విచక్ర వాహన తాళాలు లాక్కున్నారని, దీంతో న్యాయవాది తాళాలు ఇవ్వాలని అడుగగా వాగ్వాదం చోటుచేసుకుంది. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతికి తెలుపగా న్యాయవాదులకు క్షమాపణ తెలపాలని కోరగా ససేమిరా అన్నారు. గతంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఉద్దేశ పూర్వకంగానే ఎస్ఐ చంద్రశేఖర్ తమను అడ్డుకొని దురుసుగా ప్రవర్తించారని న్యాయవాదులు అంటున్నారు. తమ తప్పులు ఉంటే చట్టప్రకారం ఫైన్ చెల్లిస్తాం అని చెప్పిన రౌడీలా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.



హత్య కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రభాకర్ రావు

నవతెలంగాణ-నందిపేట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్‌రావు

తాను ప్రేమించిన అమ్మాయినే ప్రేమిస్తున్నాడని తన ప్రాణ స్నేహితుడైన కార్తీక్‌ను రాజు హత్యచేశాడని ఏసీపీ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు హత్యకేసు వివరాలను వెల్లడించారు. మండలంలోని ఆంధ్ర నగర్ గ్రామంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసముండే కార్తీక్, రాజు ఇద్దరు ప్రాణ స్నేహితులని, అదే గ్రామానికి చెందిన అమ్మాయిని రాజు, కార్తీక్ ప్రేమించారని తెలిపారు. కార్తీక్ కూడా ప్రేమిస్తు న్నాడని తెలుసుకున్న రాజు కార్తీక్‌ను విజయ నగరం గుట్టల్లోకి తీసుకెళ్లి తన తమ్ముడు హరీష్ సహాయంతో హత్య చేశాడని అన్నారు. తన కొడుకు కార్తీక్‌ను రాజు హరీష్ చంపి పడేశారని, ఈ నెలలో కార్తీక్ తల్లి తమకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించి అస్థిపంజరాన్ని స్వాధీనం పరుచుకున్నామన్నారు. దీంట్లో భాగంగా నిందితుల కోసం జగిత్యాల జిల్లాతో పాటు నిజామాబాద్ జిల్లాలో గాలింపు చేపట్టామని తెలిపారు. మంగళవారం మండలంలోని కౌల్ పూర్ గ్రామంలో నిందితులను పట్టుకున్నట్టు వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తలిస్తున్నామని తెలిపారు.